క్లుప్తంగా

సరస్వతీ దేవి విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణ పూజల్లో ఎంఈఓ-2 వెంకటరమణ, ఉపాధ్యాయులు

బొండపల్లి: మండలంలోని కొత్తపనసలపాడు ప్రాథమిక పాఠశాలలో విజయనగరం శారదా పీఠం సహకారంతో ఉపాధ్యాయులు సరస్వతీ దేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. వసంత పంచమి సందర్భంగా ఈ విగ్రహాన్ని ఎంఈఓ-2 అల్లు వెంకటరమణ సోమవారం ఆవిష్కరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. హెచ్ఎం పూడి మహేష్, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ బంగారు నాయుడు

గుర్ల: మండలలలోని రాగోలులో ఉపాధి హామీ పనులను సర్పంచ్ చందక బంగారు నాయుడు సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనదారులందరికీ వంద పనిదినాలు కల్పించాలని, అలాగే జాబ్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ జాబ్‌కార్డులు మంజూరు చేయాలని సూచించారు. స్థానిక నాయకులు గేదెల లక్ష్మణరావు, మజ్జి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



పోలింగ్ కేంద్రంలో సదుపాయాలను పరిశీలిస్తున్న అధికారులు

కొత్తవలస: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి స్థానిక ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ బి.నీల కంఠ రావు, ఎంపీడీఓ రమణయ్య, సీఐ షణ్ముకరావు సోమవారం సందర్శించారు. విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, తదితర సదుపాయాలను పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం 123 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఓటు కోసం మరో 12 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిశీలించి మూడింటిని తిరస్కరించామన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున గ్రామాల్లో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు,బ్యానర్లు ఉండకూడదని,పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఓలు ఆదిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని చెప్పారు. అధికారుల వెంట హెచ్ఎం చీపురపల్లి ఈశ్వరరావు, తదితరులు ఉన్నారు.

9 మద్యం సీసాలు సీజ్



విలేకరులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ జె.జనార్ధన రావు

గజపతినగరం: బొండపల్లి మండలం కిండాం అగ్రహారం గ్రామంలో నిర్వహించిన దాడుల్లో 9మద్యం సీసాలను పట్టుకుని సీజ్ చేసినట్లు స్థానిక ఎక్సైజ్ సీఐ.జె.జనార్దన్ రావు తెలిపారు. ఈ మేరకు సోమవారం గజపతినగరం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దాడుల్లో పట్టుబడిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సైలు పి.నరేంద్రకుమార్, ఎన్.కొండలరావు, హెడ్ కానిస్టేబుల్ వి.అప్పారావు,బి.గంగాధరుడు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం



బక్కునాయుడుపేట మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులనాయుడు

వేపాడ: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయనున్న తనకు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు ఉపాధ్యాయులను కోరారు. మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పీఆర్టీ యూ నాయకులతో కలిసి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులతో శ్రీనివాసులనాయుడు మాట్లాడుతూ ఈనెల 7వ తేదీన విశాఖపట్నంలో నామినేషన్ దాఖలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఫిబ్రవరి 27న పోలింగ్ ఉంటుందని చెప్పారు. పీఆర్టీయూ మిత్ర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బస్సు రాదు.. ఇబ్బందులు తీరవు

- వేపాడ మండలంలోని గ్రామాలకు రోడ్డు సదుపాయం ఉన్నా... బస్సు సర్వీసులు సున్నా
- కనీసం మండల కేంద్రానికి కూడా బస్సు సౌకర్యం లేదు
- ఆటోల్లోనే రాకపోకలు సాగిస్తున్న ప్రజలు



వేపాడలో నిరుపయోగంగా బస్ స్టేషన్

వేపాడ: మండలంలోని గ్రామాలకు రోడ్డు సదుపాయం ఉన్నప్పటికీ బస్సు సదుపాయం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఎంత అత్యవసరమైనా సరే ఆటోలోనో, సొంత వాహనాల్లోనో వెళ్లాల్సిందే. పోనీ మండలంలో ఆర్టీసీ బస్సులు నడపడం వల్ల సంస్థకు తగినంత ఆదాయం రావడం లేదా అంటే అదీ లేదు. ఎస్.కోట నియోజక వర్గ కేంద్రంలో ఆర్టీసీ డిపో ఏర్పాటు చేసిన తొలిరోజుల్లో డిపోకు లాభాలు తెచ్చిపెట్టిన రూట్లలో ఎక్కువగా వేపాడ మండలంలోనే ఉండేవి.అలాంటి రూట్లలో నేడు ఒక్క బస్సుకూడా తిరగకపోవడంతో మండలంలోని 29 పంచాయతీలకు చెందిన 55 వేల జనాభా తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రజలు తమ ప్రయాణాలు సాగించేందు కు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఎస్.కోట ఆర్టీసీ డిపోకు 18 వేపాడ మండల కేంద్రం కిలోమీటర్ల దూరంలో ఉంది. మండలంలోని గ్రామాలకు ఎలాగూ బస్సులు నడపడం లేదని, కనీసం వేపాడ నుంచి ఎస్.కోటకు, జిల్లా కేంద్రానికి, అలాగే ఎస్.కోట నుం చి వేపాడ మీదుగా చోడవరం, అనకాపల్లి, వేపాడ నుంచి కొత్తవలస మీదుగా విశాఖపట్నానికి అయినా డైరెక్ట్ బస్సు సర్వీసులు నడపాలని ప్రజలు కోరుతున్నారు. బస్సు సర్వీసులు నడపాలని మండల ప్రజలు పదేపదే వినతులు సమర్పించుకుం టున్నా ఫలితం దక్కడం లేదు. అప్పుడప్పుడూ ఆర్టీసీ సిబ్బంది రూట్ సర్వే, ప్రజాభిప్రాయ సేకరణ అంటూ హడావుడి చేయడమే తప్ప ఒక్క బస్సు సర్వీసు కూడా వేయలేదు. బస్సు సర్వీసులు లేకపోవడంతో వేపాడలో బస్సుస్టేషన్ నిరుపయోగంగా ఉంది. గ్రామాల్లోని స్కూల్ పిల్లలకు మాత్రం బడి బస్సు కొంతకాలంగా నడుస్తోంది. అలాగే గాజువాక డిపో నుంచి ఆనందపురం మీదుగా వేపాడకు ఒక బస్సు రోజూ రెండు సార్లు వస్తోంది. మద్దిలపాలెం డిపో నుంచి 12డి/వి బస్సుకు నైట్ హాల్ట్ సదుపాయం వేపాడలో ఉంది. బస్సులు లేక ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని, ఇదే అదునుగా ప్రైవేటు వాహన చోదకులు ఇష్టారీతిగా చార్జీలు వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.



వేపాడలో రూట్‌లో ఆటోల్లో ప్రయాణాలు సాగిస్తున్న ప్రజలు



బస్సు సర్వీసు కోసం వేపాడ రూట్‌లో గతేడాది నవంబర్‌లో సర్వే చేసిన అధికారులు (ఫైల్)

బస్సు సౌకర్యం కల్పించండి



గతంలో వీలుపర్తి మీదుగా వావిలపాడుకు బస్సు సౌకర్యం ఉండేది. కొన్నేళ్ల క్రితం బస్సు సర్వీసు నిలిపివేశారు. బస్సులు లేక ఆటోల్లో ప్రయాణాలు సాగించాల్సి వస్తోంది. మా గ్రామం నుంచి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రం వేపాడకు వెళ్లే వారి నుంచి ఆటో డ్రైవర్లు చార్జీగా రూ.20 వసూలు చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని బస్సు సదుపాయం కల్పించాలి.

– పచ్చికూర సూర్యనారాయణ, వీలుపర్తి

ఇబ్బందులు పడుతున్నాం



మండల కేంద్రం వేపాడకు, అక్కడి నుంచి ఎస్.కోట, కొత్తవలస, ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే ఆటోలే శరణ్యం. గతంలో కొత్తవలసకు బస్సు ఉండేది. ప్రస్తుతం ఆ సదుపాయం లేదు. ఆటోల్లో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నాం. పల్లె వెలుగు బస్సులను సైతం పల్లెలకు తిప్పకుండా పట్టణాలకే పరిమితమం చేస్తే గ్రామీణ ప్రాంత ప్రజల పరిస్థితి ఏంటి.? అందరికీ సొంత వాహనాలు ఉండవు కదా..?. వెంటనే బానాది, బల్లంకి గ్రామాల మీదుగా బస్సు సౌకర్యం కల్పించంచాలి.

– గుమ్మడి రామకృష్ణ, బానాది

కొత్త బస్సులకు ప్రతిపాదనలు చేశాం

డిపోలో సరిపడా బస్సులు లేకపోవడంతో కొత్త సర్వీసులు నడపలేకపోతున్నాం. డిపోలో కండక్టర్లు, డ్రైవర్ల కొరత కూడా ఉంది. కొత్త బస్సులుకు ప్రతిపాదనలు చేశాం. కొత్త బస్సులు అందుబాటులోకి వస్తే వేపాడ రూట్‌లో సర్వీసులు పునరుద్ధరిస్తాం.

– కె.రమేష్, ఎస్.కోట ఆర్టీసీ డిపో మేనేజర్

200 పనిదినాలు కల్పించాలి



ఉపాధి హామీ వేతనదారులకు ఏడాదికి 200 పనిదినాలు కల్పించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాడి అప్పారావు ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. ఉత్తరాపల్లి గ్రామ సమీపంలోని దిబ్బచెరువులో ఉపాధి వేతనదా రులతో కలిసి సోమవా రం ఆందోళన చేశారు. ఈసందర్భంగా అప్పారావు మాట్లాడుతూ వేతనదారులకు రోజుకు రూ.600 వేతనం, ఇతర అలవెన్స్‌లు ఇవ్వాలని, పనిప్రదేశంలో తాగునీరు, మెడికల్ కిట్లు, నీడకోసం టెంట్లు అందుబా టులో ఉంచాలని, మేట్లకు రూ.10 వేల వేతనం చెల్లిం చాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రవేశ పెట్టిన బడ్జెట్‌తో సామాన్య ప్రజానీకానికి, కార్మికులకు ఎలాంటి ప్రయోజనం లేదని విమర్శించారు. అనంతరం బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, సభ్యులు సబ్బవరపు భాగ్యలక్ష్మి,మల్లవరపు రమణమ్మ, పి.లక్ష్మి పాల్గొన్నారు.

– కొత్తవలస

జిన్నాంలో వైద్యశిబిరం



జిన్నాం గ్రామంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ ఆధ్వర్యంలో సోమవారం 104 వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యాధికారి, సిబ్బంది కలిసి 71మందికి వివిధ వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. పరిస రాల, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యజాగ్రత్తలు పాటించాలని ప్రజలకు అవగాహన కల్పించారు.

– గజపతినగరం

కాలుష్య నివారణకు చర్యలు తీసుకోండి



కొత్తవలస మండలంలోని అప్పన్నపాలెం గ్రామ సమీపంలోని జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్ కర్మాగారం వల్ల కాలుష్యం విపరీతంగా పెరిగిపోతోందని, ని యంత్రణకు చర్యలు తీసుకోవాలని నిమ్మలపాలెం గ్రామస్తు లు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని కోరారు. ఎమ్మెల్యేను ఎల్.కోట మండల కేంద్రంలోని స్వగృహంలో నిమ్మలపాలెం గ్రామస్తులు సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పగలు, రాత్రి అనే తేడా లేకుండా కర్మాగారం నుంచి పొగ, దుమ్ముచ ధూళి విడుదలవుతోందని, గృహసముదాయాల్లో, పంటలపై, పశుగ్రాసాలపై దుమ్ము, ధూళి పేరుకు పోతోందని ఎమ్మెల్యేకి వివరించారు. నిమ్మలపాలెం గ్రామస్తులు కొట్యాడ శ్రీనివాసరావు,గొంప కృష్ణమూర్తి, గొంప దుర్గా ఉమేష్, గొంప అయ్యన్న పాల్గొన్నారు.

– లక్కవరపుకోట

బడ్జెట్‌పై సీపీఎం నిరసన



ఎస్.కోట ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

శృంగవరపుకోట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌కు వ్యతి రేకంగా సీపీఎం నాయకులు సోమవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన తెలిపారు. సీపీఎం నాయ కుడు మద్దిల రమణ మాట్లాడుతూ ఈ బడ్జెట్‌తో సామాన్య ప్రజానీకానికి, కార్మిక వర్గానికి, రైతాంగానికి, రాష్ట్రా నికి కానీ ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ఇది కార్మిక, కర్షక వ్యతిరేక బడ్జెట్ అని అన్నారు. ఉత్తరాంధ్ర సాగు నీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించలేదని ధ్వజమెత్తారు. అంకెల లెక్కలు చెప్పి, ఆదాయ పన్ను పరిమితి పెంచామని, వేతన జీవులను మోసం చేసి జీఎస్టీ భారీగా పెంచేసి, అన్ని వర్గాలను దోచుకునే కుట్ర పన్నార న్నారు. సీపీఎం నాయకులు కె.రమేష్, ఎం.రాజు, వి.చరణ్, లక్ష్మి, షేక్ మదీనా, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ టెస్ట్ పేపర్ల పంపిణీ



ఇటకర్లపల్లిలో విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్లు అందజేస్తున్న యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు అప్పలనాయుడు

చీపురుపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు యూటీఎఫ్ తయా రు చేసిన మోడల్ టెస్ట్‌పేపర్లు ఎంతగానో దోహదపడతాయని యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మీసాల అప్పలనాయుడు అన్నా రు. ఆయన స్వగ్రామం ఇటకర్లపల్లిలో సోమవారం పదో తరగతి విద్యార్థుల ఇళ్లకు వెళ్లి మోడల్ టెస్ట్ పేపర్లు పంపిణీ చేశారు. ఈసం దర్భంగా ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఏటా మోడల్ టెస్ట్ పేపర్లు విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలలకు మోడల్ టెస్ట్ పేపర్లు అందజేస్తామన్నారు.

కేజీబీవీలో పంచాయతీ నిధులతో హ్యాండ్ బోరు



బోరును ప్రారంభిస్తున్న ఎస్‌ఓ కిరణ్మయి, వార్డుమెంబర్ రమణ

వేపాడ: బక్కునాయుడుపేట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో వేపాడ పంచాయతీ నిధులు లక్షరూపాయలతో హ్యాండ్ బోరు ఏర్పాటు చేశారు.బోరును కేజీబీవీ ఎస్ఓ కిరణ్మయి, వార్డు మెంబర్ మిరపాక రమణ సోమవారం ప్రారంభించారు. బోరుకు పంచాయతీ నుంచి నిధులు సమకూర్చిన సర్పంచ్ మిరపాక అర్జున్నమ్మకు కేజీబీవీ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

పీడీఎస్ బియ్యం వేలం

చీపురుపల్లి: స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద తహసీల్దార్ ఎన్.రాజారావు ఆధ్వర్యంలో సోమవారం 525.98 క్వింటాళ్ల రేషన్ బియ్యంను వేలం వేశారు.వేలంపాటలో 12మంది పాల్గొనగా,న ర్సీపట్నంకు చెందిన నడుగట్ల శ్రీనివాసరావు కిలోకి రూ.25 చెల్లించి బియ్యం దక్కించుకున్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ పరిధి మండలాల సీఎస్‌డీటీలు పాల్గొన్నారు.

గజపతినగరంలో..

గజపతినగరం: స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద 55.33 మెట్రిక్ టన్నుల పీడీఎస్ బియ్యంను తహసీల్దార్ రత్నకుమార్ ఆధ్వర్యంలో వేలం వేశారు. కిలోకి రూ.27 చొప్పున చెల్లించేలా జా మి మండలం తాన్నవరం గ్రామానికి చెందిన తాతాజీ వేలంపాటలో బియ్యం దక్కించుకున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న మంత్రి శ్రీనివాస్

గజపతినగరం: మండల కేంద్రంలోని దిగువ వీధిలో పైడితల్లి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకున్నారు. మంత్రికి స్థానిక పెద్దలు, ఆలయ ధర్మకర్త కందుల చిన్న య్యస్వామి స్వాగతం పలికి, ఆయనతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. స్థానిక నాయకులు పి.వి.వి. గోపాలరాజు, ఎం.శ్రీధర్,గంట్యాడ శ్రీదేవి, ప్రదీప్ కుమార్, సర్పంచ్ నరవ కొండమ్మ, రుంకాన అరుణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జాకేరులో తీర్థ మహోత్సవాలు

వేపాడ: మండలంలోని జాకేరు గ్రామంలో వీరాంజనేయస్వామి, పైడమ్మ, చిన్నమ్మ పేరంటాల తీర్థ మహోత్సవాలు మంగళ, బుధవారాల్లో నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు బుద్దా అప్పలనాయుడు, తదితరులు తెలిపారు.తీర్థ మహోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్ట ర్లను గ్రామంలో సోమవారం ఆవిష్కరించారు. బుధవారం గుర్రాల పరుగు ప్రదర్శన, సంగిడీ రాళ్ల పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు కమిటీ సభ్యులు చెప్పారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

సోమశేఖర్‌కు తెలుగు వెలుగు నంది అవార్డు



సోమశేఖర్‌కు అవార్డు అందజేసి సన్మానిస్తున్న ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్, తెలుగు వెలుగు సాహితీ వేదిక ప్రతినిధులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): తన మిమిక్రీతో అందరినీ నవ్విస్తూ మంచి గుర్తింపు పొందిన గరివిడి పట్టణానికి చెందిన జమ్ము సోమశేఖర్‌ను తెలుగు వెలుగు నంది పురస్కారం వరించింది. స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో భాగంగా విజయవాడకు చెందిన తెలుగు వెలుగు సాహితీ వేదిక వివిధ కళారంగాల్లోని ప్రతిభావంతులకు నంది పురస్కారాలను ప్రధానం చేసింది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఫిబ్రవరి-2న జరిగిన కార్యక్రమంలో సోమశేఖర్‌కు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, అతిథులు నంది పురస్కారం అందజేసి, సన్మానించారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి రమణ

గంట్యాడ: ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు, కూటమి నాయకులు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ డిమాండ్ చేశారు. మండలంలోని నరవ గ్రామంలో స్థానికులతో కలిసి గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు.పేదలకు ఇళ్ల నిర్మాణాలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సహాయం, దళితులకు రెండెకరాల భూమి అందిస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక ఆర్థిక విధానాల వల్ల ఇంటి పన్ను, కరెంటు బిల్లు, నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగాయన్నారు. ఇంటి అద్దెలు చెల్లించలేక సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఇబ్బంది పడతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్, సీపీఐ మండల కార్యదర్శి కాళ్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అక్షర వేడుక..



బొండపల్లి: దేవుపల్లిలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అక్షరాభాస్యాలు చేయిస్తున్న అర్చకులు శ్రీధర్ శర్మ

గజపతినగరం, ఎస్.కోట, చీపురుపల్లి నియోజకవర్గాల్లో వసంత పంచమి వేడుకలను ప్రజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయాలు, ప్రభు త్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుల తల్లి సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. బొండపల్లి మండలం, దేవుపల్లిలోని రాజరాజేశ్వరీ దేవి ఆలయంలో అమ్మవారు జ్ఞాన సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.అర్చకులు దూసి శ్రీధర్‌శర్మ చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు.ఎస్.కోటలోని దుర్గా దేవి ఆలయంలో పలు ప్రైవేటు పాఠశాలల్లో అక్షరాభ్యాసాలు చేయించారు.ఎల్.కోట మండలంలోని జమ్మాదేవిపేట జ్యోతిరావు పూలే బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులు సరస్వతీ దేవికి పూజలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



వేపాడ: విక్టరీ స్కూల్‌లో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు



లక్కవరపుకోట: జమ్మాదేవిపేట బాలికల ఆశ్రమ పాఠశాలలో పూజలు చేస్తున్న విద్యార్థినులు, ఉపాధ్యాయినులు



శృంగవరపుకోట: ఎస్.కోట దుర్గాదేవి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాలు



శృంగవరపుకోట: ఎస్.కోటలోని డీపీఎల్ పబ్లిక్ స్కూల్‌లో చిన్నారులతో అక్షరాభ్యాసాలు చేయిస్తున్న తల్లిదండ్రులు



శృంగవరపుకోట: కౌముది గ్లోబల్‌స్కూల్‌లో అక్షరాభ్యాసం చేసిన చిన్నారులతో వారి తల్లులు

పక్కాగా ఎన్నికల కోడ్ అమలు చేయాలి



పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ కల్యాణి

గజపతినగరం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలని ఎంపీడీఓ బి.కల్యాణి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలుపై దిశా నిర్దేశం చేశారు. గ్రామాల్లో రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగించాలని, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు.ఈఓపీఆర్డీ సుగుణాకరరావు పాల్గొన్నారు.

10 నుంచి సదరం సర్టిఫికెట్ల పరిశీలన

దత్తిరాజేరు: పింఛన్ పొందుతున్న దివ్యాంగులకు సంబంధించిన సదరం సర్టిఫికెట్ల పరి శీలన గజపతినగరం సీహెచ్‌సీలో ఈనెల 10వ తేదీ నుంచి 25వ వరకు జరుగుతుందని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ సోమవారం తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వైద్యులు వచ్చి మండలంలోని 380 మంది సదరం సర్టిఫికెట్లతో పాటు వారి వైకల్యాన్ని పరిశీలిస్తారని పేర్కొన్నారు.